# ప్రత్యామ్నాయం

## - బద్దిగం పాండురంగారెడ్డి

హడావుడిగా ఉంది పెళ్ళిపందిరంతా సందడితో. పట్టుచీరలు గరగర చప్పుడు చేసుకుంటూ ఆడవాళ్ళు ఖంగారుగా అటూ ఇటూ తిరుగుతున్నారు. జట్లుగా చేరి ఏదో అర్థంలేని ఆట ఆడుకుంటున్నారు పిల్లలు. పేకాటగాళ్ళు వాళ్ళ గొడవలో పూర్తిగా మునిగిపోయారు.

అంతమందిలోనూ ఆ ఉత్సాహాతిశయాన్ని పూర్తిగా ఆనందించలేక అవస్థపడుతున్నవాడిని నేనొక్కణ్ణే.

అగ్నిహోత్రంలో పోసిన నెయ్యి పొగరూపంలో చుట్టలు చుట్టలు చుట్టుకున్న కాలభుజంగంలా పైకొస్తోంది. పొగవల్ల నాకళ్ళు ఎర్రబడ్డాయి.

పాత జ్ఞప్తితో నా మనస్సు భయంతో చిప్పలోకి ముడుచుకున్న తాబేల్లా ముకుళించుకుపోయింది.

బ్రాహ్మడు చెప్పినట్టల్లా.. ఒక యంత్రంలా మాత్రమే నేను పనిచేస్తున్నాను. నా ఆలోచనలు పరిపరి విధాలా పోతున్నాయి.

లలినీ వేపు చూశాను. తొణక్కుండా, బెణక్కుండా స్థాణువులా కూర్చుంది. కనీసం మొహమాటానిక్కూడా తల వంచుకొని సిగ్గుపడుతున్నట్టు కనిపించలేదు.

లోతైన ఆ కళ్ళలో ఒక దృఢ నిశ్చయం, విశాలమైన ఆ ముఖంలో ఏదో ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అవి పూర్తిగా లోపించిన నాకు ఆశ్చర్యం వేసింది.

లలినీకీ, అనిలకీ ఎంత వ్యత్యాసం.

ఒక లిప్తకాలంలోనే మూడు సంవత్సరాల గతంలోకి జారిపోయాను నేను.

అప్పట్లో ఎన్నో సంబంధాలు చూసినా కొందరు నాకు నచ్చలేదు, కొందరు అక్కకి నచ్చలేదు. 'ఈ పిల్ల మనింట్లో నెగ్గుకు రాలేదురా...' అని తోసిపారేసింది, పెద్ద తను ఇంకోళ్ళింట్లో మహ చక్కగా వెలగబెడుతున్నట్లు.

రెండు సంబంధాలు కాబోలు... అన్నీ కుదిరి కట్నాల దగ్గర బెడిసికొట్టాయి. ఒకమ్మాయి తండ్రి కట్నమే ఇవ్వలేనని ఘంటా బజాయించి చెప్పాడు. ఇంకో పెద్దమనిషి లాంఛనాల దగ్గర బేరసారాలు చేసి పెళ్ళి పెద్దలతో పేచీపడ్డాడు. నాకు చెప్పలేనంత విసుగొచ్చింది.

తాత్కాలికంగా అసలు పెళ్ళి ప్రయత్నమే విరమించుకుందామనుకున్నాను.

అదిగో... అల్లాంటి కృత్యాద్యవస్థలో లనిలని చూడటం... యాదృచ్ఛికంగా జరిగింది. అందగత్తె కాకపోయినా అనిర్వచనీయమైన వింత ఆకర్షణ అనిలలో ప్రత్యేకత. క్షణంలో సగంసేపు నీలాకాశంలో మెరిసే మెరుపులా తళుక్కుమనే చిరునవ్వు నన్ను ఒక నిర్ణయానికి తీసుకొచ్చింది. ఆలోచించినంతసేపే ఎవరికైనా సమస్య గంభీరంగా కన్పడుతుంది. తెగించి ఒక పరిష్కారానికి వస్తే అంతా గాలికి చెదిరిపోయే మబ్బు పింజల్లా విడిపోతుంది. ఆ రోజుతో నా మనస్సు కుదుటబడింది. అనిలని చేసుకుందాం అనుకున్న క్షణం నుంచీ నేను ఏదో తేలికగా గాలిలో తేలిపోతున్నట్లు ఫీలయ్యాను. తరువాత నాకు ఏ అడ్డంకులూ రాలేదు.

అయితే ఒక్కటి. మా అమ్మమ్మ అన్నమాటలకి అప్పట్లో నేనంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. కానీ దానిలోని ఆంతర్యం నాకు త్వరలోనే తెలిసిపోయింది. 'ఒరేయి అబ్బాయి... అన్నానని కాదు. ఆలోచించుకో... ఆ పిల్ల.. అనకూడదు.. కానీ.. మరీ అర్భకంగా ఉందిరా. అంతా చూస్తే ఆ పిల్ల నడుము.. నిండా జానెడు కూడాలేదు. ఇంక పిల్లవాడ్ని ఎలా మోస్తుంది.'

ప్రక్కనున్నవాళ్ళు ముసలావిడ నోరు నొక్కేసారు.

అమ్మలగన్న అమ్మ.. ఆ మహాతల్లి వాక్శుద్ధో తెలీదు.. లేక కేవలం నా తలరాతో తెలీదు. రాణీ పుట్టగానే అనిల నాకు దూరమయిపోయింది. మహా ప్రవాహంలో కొట్టుకుంటూ వచ్చే చెట్టుకొమ్మలు కొద్దిసేపు కలిసి ప్రయాణం చేస్తాయి. వెంటనే ప్రవాహ వేగానికి విడిపోతాయి. జీవితం కూడా అంతే అన్పించింది. అనిలతో నా సంసారం కేవలం ఒక్క ఏడాది. అనిల ఆకస్మిక నిష్క్రమణ నాకు పెద్ద విద్యుత్ ఘాతంలా తగిలింది. ఆ షాక్ ధాటికి తట్టుకోలేక మానసికంగా చాలా క్రుంగిపోయాను.

ఉన్నప్పుడు వస్తువు విలువ తెలియదు. దానిని పోగొట్టుకున్ననాడు ఆ వెలితి మనస్సంతా నిండిపోయి మనిషిని అతిగా వ్యాకుల పరుస్తుంది. జీవించినప్పుడు అనిల నా భార్య.. ఒక సామాన్య స్త్రీ. కానీ నాకు కాకుండాపోయిన అనిల... విశ్వం అంతా వ్యాపించి నాకు క్షణ క్షణం గుర్తుకొస్తూ... అడుగడుగునా నా మనోనేత్రంలో కన్పిస్తూ అబ్బా.. ఆ జ్ఞాపకాలు కేవలం మర్చిపోటానికి.. ఆ అనుభవాలు పూర్తిగా తుడిచివేయటానికి నేను విజయవాడ బదిలీ చేయించుకున్నాను. రాణిని అనిల ప్రతిబింబంగా చూసుకుంటూ మళ్ళీ అనిలే పుట్టిందని సంతృప్తిపడ్డారు పెద్దవాళ్ళు.

'అనుభవాలు, జ్ఞాపకాలు పలకమీద వ్రాసిన అక్షరాలు కాదు రంగా తుడిచివేస్తే పోటానికి. పలాయనత్వం అంత మంచిది కాదు. దానివలన నువ్వు సాధించే పరిష్కారం నిజానికి తాత్కాలికం.. వాటీజ్ డన్ కెనాట్ బి అన్‌డన్ జీవితంలో ఆలస్యం అనేది లేదు రంగా- ఇటీజ్ నెవర్ టూలేట్.. ఏ నిముషంలోనైనా నువ్వు మనస్సు మార్చుకొని క్రొత్త అధ్యాయం ప్రారంభించవచ్చు. నీకు తెలియందేమీ లేదు. నీకు సలహా చెప్పగల సమర్థత గలవాడిని కాను. అయినా చెప్పాలి కాబట్టి చెప్తున్నాను. మళ్ళీ పెళ్ళి చేసుకొని.. సుఖంగా ఉంటూ ఆ పసికందుకొక తల్లిని చూపించు. నామాట విను' అన్నాడు మూర్తి ఓ సాయంత్రం గోదావరి ఒడ్డున మాటల సందర్భంలో నా ట్రాన్స్‌ఫర్‌కి ఆశ్చర్యపడుతూ.

'జీవితం ఏమైనా మన ఆఫీసా మూర్తీ- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవటానికి. మూర్ఖంగా నేనటువంటి ప్రయత్నమే చేసినా రెండో భార్యను పొందగలను గాని... ఆవిడ రాణికి తల్లవుతుందా మూర్తీ! నీదంతా భ్రమగానీ...' అని చాలా తేలిగ్గా తోసేశాను మూర్తి మాటల్ని.

'సరే! నీ ఇష్టం. విజయవాడలో నువ్వు ఇబ్బంది పడనవసరం ఏమాత్రం లేదు. నీకు వసతి, భోజనం ఏర్పాట్లన్నీ చేస్తాను. తిన్నగా మా సుభద్రమ్మ పిన్ని వాళ్ళింటికి వెళ్ళిపో. ప్రస్తుతం నువ్వు గదిలో ఒంటరిగా ఉంటూ, హోటల్ భోజనం తినటం కూడా అంత శ్రేయస్కరం కాదు.'

మూర్తి లాంటి స్నేహితులు కోటికి ఒకరుంటారేమో! మూర్తి నా గురించి ఇచ్చిన పరిచయం ఎంత బలమైనదో నేనూహించలేను. సుభద్రమ్మగారు, లలిని నన్ను కంటికి రెప్పలా కాపాడారు. వారి ఆదరణలో నేను గతాన్ని నెమ్మదిగా మర్చిపోగలిగాను. ఎంతటి గాయాన్నయినా మాన్పగల శక్తి కాలచక్రానికుంది. నేను మామూలు మనిషినయ్యాను. నన్ను బాధపెట్టడం ఎందుకని కాబోలు లలిని ఎంతో నేర్పరితనంతో సంభాషణ నడిపేది. లలిని సహచర్యంలో రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. నాలో ఉత్సాహం కూడా గమనవేగాన్ని పుంజుకుంది.

రాను రాను లలిని నాయందు కన్పరుస్తున్న శ్ర

పెరిగే పెరిగి ఎక్కువైపోతోంది. ప్రతిఫలాపేక్ష లేకుండా పరాయివాళ్ళకి, ఆపత్కాలంలో సహాయం చెయ్యటానికి వీళ్ళు ఆదిశేషువులా? సూర్యచంద్రులా? అన్న సంశయం కల్గేటంతగా వారి ప్రవర్తన అవకాశం ఇచ్చింది. ఆ ఆలోచన కల్గాక నేను చాలా ఇబ్బంది పడ్డాను. సాలెగూడులోని ఈగలాగా నేను చిక్కుకుపోలేదు కదా! అంత సంకుచితంగా వ్యవహరిస్తున్నది నేనేనని లలిని చాలా విశాల హృదయంతో వర్తిస్తోందని కొరడాతో కొట్టినట్లు వచ్చాయి లలిని మాటలు.

'నువ్వు పొరబాటుగా అర్థం చేసుకున్నావు లలినీ నన్ను. నా గురించి పూర్తిగా తెలిస్తే నీ అభిప్రాయం పూర్తిగా మార్చుకుంటావ్' అన్నాను ఓరోజు సుభద్రమ్మగారు ఇంట్లో లేకుండా చూసి ఎంతో జాగ్రత్తగా.

'ఏమిటో మీగురించి నేను అంతగా తెల్సుకోవల్సిన అతి ముఖ్యమైన విషయం' నొక్కినొక్కి పల్కుతూ అంది లలిని.

విప్పిన షర్టు హేంగర్‌కి తగిలిస్తున్న నేను ఒక్కసారి లలిని మొహంలోకి తీక్షణంగా చూశాను. ఆ సమయంలో నాకేమీ సమాధానం చెప్పబుద్ధికాలేదు.

'మీరేం చెప్పకపోయినా... నాకన్నీ తెలుసు రంగారావుగారూ. మీరు వివాహితులు. ఆవిడ పోయారు.. మీకొక ఆడపిల్ల. తాతగారి సంరక్షణలో పెరుగుతోంది. మీరు ఏది ఏమైనా మళ్ళీ పెళ్ళి చేసుకోరు. ఎంచేతంటే భార్య దొరుకుతుంది గానీ... రాణీకి తల్లి దొరకదు. అంతేనా? ఇంకా ఏమైనా ఉందా?' అంది లలిని.

'అంటే... మూర్తి అన్నీ చెప్పేశాడన్నమాట.'

నేనెంతో ఉదాత్తుడనుకున్న మూర్తి ఎంత నమ్మకద్రోహి... ఎంత స్వార్థపరుడు. నాలోని భావాలు లలిని చదవగల్గింది.

'అన్నయ్యదేం తప్పులేదు. నేనే వివరాలన్నీ సేకరించాను.'

లలినీతో సంభాషణ అనుకోని మలుపులు తిరుగుతోంది. నేను నిరుత్తరుడనయి అలా ఆమె మొహంలోకి చూస్తూ నిలబడిపోయాను.

'మీకు ఒక్క ఆడపిల్లే కాదు.. డజను మంది పిల్లలున్నా నేను మిమ్మల్నే ప్రేమిస్తాను. పెళ్ళి చేసుకుంటాను... మీరిష్టపడితేనే అనుకోండి. కానీ ఒక్కటి గుర్తుంచుకోండి- నేను మీకు కేవలం భార్యనే కాదు.. ఖచ్చితంగా రాణీకి తల్లిని కూడా కాగలను.' లలినీలోని ఆత్మవిశ్వాసం, నిగూఢంగా ఉన్న ధైర్యం నన్ను మాట్లాడనివ్వలేదు. సుభద్రమ్మగారి రాకతో మా సంభాషణ ఆగిపోయింది.

సుభద్రమ్మగారి హడావుడిలో, మూర్తి పర్యవేక్షణలో, అమ్మ, నాన్నగారి ఆశిస్సులతో పెళ్ళి జరిగిపోయింది. తండ్రి పెళ్ళి పిల్ల చూడకూడదన్నారు! రాణీ రాజమండ్రిలోనే ఉండిపోయింది.

ఆరోజు రాత్రి లలినీతో ముఖాముఖి మాట్లాడే అవకాశం వచ్చింది. 'ఆరోజు తల్లి- భార్య అంటూ అంత గట్టిగా ఏదో చెప్పావ్. ఏదీ ఇప్పుడు మాట్లాడు చూద్దాం' అన్నాను వెనగ్గా వెళ్ళి పూలజడ సవరిస్తూ.

'మీరు క్షమిస్తానంటే చెప్తాను... మీరు నానుంచి దాచిన రహస్యంకంటే... నేనూ, అమ్మా, అన్నయ్యా మీకు తెలీకుండా దాచిన రహస్యం చాలా చిక్కులు తెచ్చేది. నిజమే.. మీకు భార్యనే కాదు రాణీకి తల్లిని కూడా అవుతాను తప్పకుండా. ఎందుకంటే...' వెక్కి వెక్కి ఏడుస్తోంది లలిని.

'లలినీ.. లలినీ..' ఆవేశంలో భుజాలు పట్టుక్కుదిపేశాను. ఎంత భయంకరమైన సంగతి దాచారో వీళ్ళంతా కలిసి నాకు తెలియకుండా. ఒకవేళ లలిని బాలవితంతువు కాదుకదా!

'ఎందుకంటే.. నిజంగా మీరు క్షమిస్తారు నాకు తెలుసు.. ఆ ధైర్యంతోనే నేను, అమ్మా, అన్నయ్యా చెప్తానన్నా వద్దని వారించాను... నేను ఒక్క రాణీకే తల్లిని కాగలను. అదయినా మీరిచ్చిన ఈ అవకాశం వల్ల- అంతే! ఇంకెవ్వరికీ తల్లిని కాలేను. అస్సలు తల్లినే కాలేను... నాకా అదృష్టం లేదు. నాకు మెన్సస్ ట్రబుల్ ఉంది. దానికోసం ఆపరేషన్ చేయించుకున్నాను. అప్పుడే నాకు ఓవరీస్ తీసేశారు.' లలిని ఎక్కిళ్ళు ఆగలేదు ఇంకా. చెక్కిళ్ళు కన్నీటితో తడిసిపోయాయి.

ఇప్పుడు రాజీ పడాల్సింది నేను. నా అంచనా మరోసారి తప్పయింది. మనస్సులోనే ఓడిపోయినట్లు ఫీలయ్యాను. ఇంత మంచివాళ్ళ మధ్యలో ఉండటం ఎంత కష్టం. ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాను లలినీని. తడి ఆరని లలినీ కళ్ళలో నాకు నిజంగా మళ్ళీ అనిలే కన్పించింది.

★

